# గండిపడిన మొండి జీవనం

* శ్రీ కవికొండల వేంకటరావు *

ఊరుపేరు చెప్పినా, మనిషిపేరు చెప్పినా అంతా ఎగబడతారు తెలుసుకోడానికి. పేరులో అంత చమత్కారం వుంది. అయితే కథలో చమత్కారం వున్నప్పుడు పేరుతో నిమిత్తం లేదు. చదివేవానికి స్ఫురిస్తేచాలు. ఎక్కడ వుంది ఆవూరు, ఎవరా మనిషి అని!

కొన్ని కొన్ని చూపులు వరద వచ్చాక ఒకలాగుండేవి. వరద రానప్పుడొకలాగుండేవి. రెండింటికీ పోలిక లేక పోవచ్చు. కాని, వరద వస్తూవుంటే ఆ ఒడుదుడుకు సమయంలో సాక్షాత్కరించే దృశ్యమున్నదే, అది, మనం ఆకట్టుకోగలిగితే, తత్పూర్వమెలావున్నదో, తదనంతర మేలావున్నదో, నష్టమయిందిఏదో, పుష్టిగన్నదేదో అంతో ఇంతో గోచరింపునకు రాకమానదు— పూర్వజన్మసుకృత ముకుమల్లే.

ఏమా అని ఆలోచిస్తే, అయోమయంగా, అంధ కారంలో, ప్రకాశ మిసుమంతా లేని బాటను, పరమావధి కాసంతా కానబోని నిరాశతో నీరవంగా ఒక రమణీమణి తన చిటికెనవేలు పట్టుకొని, కూడా కూడా నడుస్తూవున్న, ఒక అయిదారేళ్ళ ఆడపిల్లతో, తల్లీ పిల్లా ఇరువురైనా ఒంటరితనమే అన్నట్టు, అడుగులు వేసుకుంటూ కోన సీమలో నడుస్తూ వున్నారు. సర్వసాధారణంగా, పగలెవ రైనా వారిద్దరూ అరికట్టేరేమోగాని, రాత్రిపూట ఎవర్నీ ఆపబోరనే అనుకోవాలి. అంత తొందర తొందరగా తల్లి అడుగులు వేస్తూ వుంది. తల్లితోబాటు పిల్లా నడుస్తూంది. చిటికెనవేలు విజ్జోడు చేసినప్పుడల్లా చీర చెఱగు పట్టు కుంటూ, చీర చెఱగు ముందుకు వైచుకొన్నప్పుడల్లా చిటికెన వ్రేలందుకుంటూ, అయోమయమైన బ్రతుకుతో, అంధరకారబంధుర మైన బాటని వారు నడుస్తూ వున్నా, వారి అడుగు క్రింద నేలపరపుగా గట్టిగా, నిబ్బరంగా, నీటుగా వున్నట్టుంది. తిన్నగా యేదో కడకు గొంపోయే టట్టు. ఎవరో వేసినట్టు వుంది. నేల కోతట్టు ప్రవహిస్తున్న కాలువ నీరు, ఓతట్టు మళ్ళీ గట్లంట బిలబిల మంటూ రొదగా వినవస్తూన్న నీరు. కాలవ దాటి ఆవలగట్టెక్కి చూదాం అంటే దాటించే పడవలేదు. ఈవల మళ్ళీ గట్లడ్డ మడి పోదాం అంటే అంతా ఊడ్చిన పొలం. కాబట్టి కాలికి తగిలే నేల ఏదారికి తీస్తే ఆదారికే వెళ్లాలి ఆ తల్లీ పిల్లా యిరువురూ కూడా!

వర్షాకాలం ఇంకా గడచిపోని గడ్డురోజులవి. ఏమైనా ప్రతిధ్వనిస్తే, కూలీలు పగలు పాడిన ఊడుపు పాటలకు చెందియుండాలిగాని కోయిల పాటలవి కానేరవు. ఏమైనా అంధకారాన్ని పోగొట్టే వెలుతురు కాపడితే, అది మేఘం మెరిసే మెరపుది కావాలికాని, కొఱవి దయ్యపు మంట కూడా కానేరదు. ఇహ లోకం అంతా నిదిరిస్తూవుందా అని అనిపించే వేళఅది. ఒక్క ప్రకృతి తప్పిస్తే—ప్రకృతి లోకూడా కొన్ని కొన్ని చెట్లయొక్క ఆకులు కనుమూసి నట్టు మూతలు పడి ఒండొంటిని హత్తుకుపోయి అదే నిదరలో పడ్డట్టున్నాయి. పంచ భూతాల్లోను నాడొక్క జలదేవత తప్ప తతిమ్మా దేవతలన్నీ ఏమైనాయా అనే మీమాంసలో పడితీరవలసిందే!

జలదేవత! ఆమె ఆపొద్దు ఎవరూ చూడకుండా, ఎవరూ వినకుండా చల్లగా సాక్షాత్కరింప సాగింది. తనపేరు తనకే తెలియదు అన్నదీమతల్లికి. మనమనుకునేం "గోదావరి" అని దానిని గూర్చి. కాని దానికదొఒళ్ళు తెలియని ఉత్తి జల ప్రవాహమే. నాసికాత్ర్యంబకమునుండి మాహాసముద్రం దాకా ఒకటే జీవనంగలదై నిత్యచేతనంగల దవడంచేతను, అది జలదేవతగా మనముందు సాక్షాత్కరింప గలుగు తూవుంది. "గోదావరి" అన్నా అదే, "దక్షణగంగ" అన్నా అదే, "అఖండగౌతమి" అన్నా అదే, "వృద్ధగౌతమి" అన్నా అదే, "వసిష్ట" అన్నా అదే, "వైనతేయము" అన్నా అదే, కోనసీమ పంటకాలవన్నా అదే, కొబ్బరి తోటను చుట్టివచ్చే అబ్బురపు టివల్ అన్నా అదే! వెళ్ళిన కొద్దీ అంతా ఆ జలదేవత మయమై యొప్పె!! అయితే, ఆదేవత, గట్లమధ్య నున్నంతసేపూ, ఎంతఎత్తు లేచినా, ఎంత ఉద్రుతం చూపించినా, ఎవరికీ ఏమీ ఫరవాలే. కట్టు బాటులోవున్న మనిషి జీవనంలాంటిది! ఏర్పాటుగా నేర్పుగా కాబడేని! గట్లు తెగి విడివడిందా, అప్పుడు చూడాలి దాని వైఖరి, విలాసం, స్వేచ్ఛా, ఇచ్ఛా! ఈ గట్లు తెగి గండి పడడం అనేది, రాత్రే జరిగేనో, పగలే జరిగేనో, పట్నానికే గొప్పతగ్గేనో, పల్లెటూరికే ముప్పు వాటిల్లేనో తెలుపనంతటి పరమరహస్యం!

ఒక్కనిమేషంలో ఏటిగట్టు తెగింది, నీరు ఈవల కాలవలోకి పడింది. అంతా తెప్పానాం తేలానాం అయి ఊరుకుంది. కనిపెట్టిన వాళ్ళులేరు. విని పించుకున్న

వాళ్ళూలేరు. ఎక్కడి పడవలక్కడ కట్టడి పోయినాయి. ఒకమైలు ఎటుచూచినా నీటివేగమూ నీటిపలుపూ తప్ప మరొకటికానం. వేలకొద్ది సుడిగుండాలు, ఎక్కడ నుంచి వచ్చేను ఈ నీరంతా అని అనుకొనేలో మతో అంతనీరు ప్రత్యక్షం. కాలవకీతట్టు తల్లీ పిల్లా నడుస్తూవున్న బాటే పారమన్నా తీరమన్నా! ఆతీరాన్నే వో కొంత దూరం తియ్యమామిడి చెట్లవరుసలు, ఓకొంతదూరం మీద కొబ్బరి మోకలు, ఓ కొంతదూరం ఊడలు దిగిన మఱ్ఱిచెట్లు, ఓ కొంతదూరం ముళ్ళతో బలిసిన తుమ్మచెట్లు, ఇలా రకరకాలు, కంచెగాకుండా, అంచుగాకుండా మించి వున్నాయి. మంచు తడిసున్నాయి. చీకట్లో అయినా అన్నీ మెఱుస్తూ వున్నాయి. మెఱుగుడు పురువుల్తో అన్నీ కీచు మంటున్నాయి. ఎదో పురుగు సంచారంతో, అన్నీ తిన్నందనం తప్పితే, తగిలేవీ తాకేవీ!

మఱి పిల్లా తల్లీ వేర్పాటు అయ్యే రోజులొచ్చాయా అని అనిపించింధి అని అనుకోండి. అఘడియ ఆలాంటిది. కాని భగవంతుడు అలా వేర్పాటుగానిస్తాడా? పేగుమమత పోనిస్తాడా?

మఱి తల్లి తలపోసింది! కాలవ కాలవలా నిలవదని, తాము నడిచేదారి దారిలా వుండబోదని? – దాన్ని కూడా తెగ్గొట్టి పెద్ద కనీ వినని గండి ఆ ప్రాంతమందు పడి తీరుతుంది అని, తామెటు పోయినా తప్పేసూత్రం ఇఖలేదని.

ఆ నిరాశాలోచనలో ఆమె కాలి కింది కప్పుడే గౌతమీ జలం వచ్చేసినట్టు అయింది. పిల్లనట్టే బుజానికెక్కించుకుంది. బుజం మీద కెక్కిన పిల్ల ఊరుకోవచ్చునా? "అమ్మా! అమ్మా! ఎంతనీరో! అంతానీరేనేవ్!" అని అరుస్తూ, ఇంకా పై జూపు చూఱ గొందామని, తనకందే ఒక లేలేత మామిడి కొమ్మనందు కుంది. తల్లి కాళ్ళ క్రింద నీరులో గుండె ఝల్లుమనేలా వెల్లువై విడగొట్టింది బాటను రెండు ముక్కలుగా. హద్దులేని దానిగా జేసింధి అధ్యమంతాను. అటో మూడు ఫర్లాంగులు, ఇటో మూడు ఫర్లాంగులు బాటా ఆ నీటి చేతను దిగమ్రింగబడి చెట్ల వ్రేళ్ల మాత్రంగా, కొమ్మల మాత్రంగా నిలిపి తన చాయను చూపిస్తూవుంది.

అరెరే! తల్లి వెల్లువనే తారుమారు రూపం దాల్చింది. పిల్లమాత్రం పోలిక చెడకుండా, కొమ్మలో కోకిల పిట్టలా నీళ్ళమీద హంసకూనలా మీద మీద గపిస్తూవుంది. నీటమునిగే చెట్టుమీద! తల్లి పిల్లను మరచిపోయిందో లేదోగాని, పిల్ల మాత్రం తల్లిని మరచి అరవసాగింది. "వారా వీరా" అని. ఉదయించే సూర్యకిరణ మొక్కటే ఆపిల్లకు మరి తోడన్నట్టు తెల్లారింది!

తెల్లారి చూస్తే లోకం అంతా మరో రూపం! ఎక్కడ చూచే ఏటిగట్టూలేదు. పడవలు నడాడే కాలవా లేదు. పంటా లేదు, వంటా లేదు. సస్యశాలిని సమస్తం సైకత సాంద్రంగా అయిపోయింది. రాజమార్గం, వస్తూపోతూ వుండే రాజమార్గంకు, బండ్ల రాయిడి తప్పి, గండ్లరాయిడి తగిలింది. పెద్ద గండి ఆచోట పడింది. అక్కడే పడింది. ఆ తల్లీ పిల్లా నడచేచోటనే పడింది. అంధకారాన్ని పడింది. అయోమయంగా పడింది.

అవితే గండిదా మొండి జీవనం, ఆమెదా మొండి జీవనం అన్నట్టు, తల్లి ఊతాలాడుతూ, పిల్ల ఎక్కి అరుస్తూ వున్న చెట్టు మొదటను కౌగలించుకుని కొస ప్రాణంతో వుంది!

పిల్ల "అమ్మా!" అంది లోకాన్ని ఆనవాలు పట్టినట్టు. తల్లి "బాగున్నావా? నా తల్లీ!" అంటూ ప్రాణం విడిచింది.

మీరందరు తప్పకుండా
చదివి తీరాల్సిన పుస్తకం!

జాజిమల్లి

(ఆంధ్ర మహిళలో సీరియల్‌గా ప్రచురింపబడిన నవలానిక)

గ్రంథకర్త:
కీ. శే. కులపతి అడివి బాపిరాజుగారు

150 పేజీలు :: వెల 1-8-0

ప్రతులు దొరుకుస్థలము:
హిగ్గిన్‌బాదమ్స్ అన్ని బుక్‌స్టాల్సు.
వెంకట్రామా అండ్ కో.,
ఆంధ్ర మహిళా ప్రెస్, మద్రాసు-4.